

# కథా కౌముది

# అముద్రిత కావ్యం - మూలా సుబ్రహ్మణ్యం

**అపూర్వచిత్ర ( సినీ నిర్మాణ సంస్థ ) సహకారంతో కౌముది - రచన నిర్వహించిన కథల పోటీలో బహుమతి పొందిన కథ.**

**ఎందుకో ఎక్కడికో తెలియకుండానే** కాలం పరుగులు తీస్తుంటుంది. నిన్నటిని జిరాక్స్ తీస్తే ఈ రోజు.. సెకన్ల ముల్లుకి కట్టేసిన కాళ్ళతో ఎప్పుడూ అవే ఉరుకులు పరుగులు. అలారం నోరు నొక్కి, గంటో రెండు గంటలో పోయాక 'ఛా ఇవాళ కూడా అనుకున్న టైంకి లేవలేకపోయానే' అని తిట్టుకుంటూ నిద్రలేవడం, 'ఇంక నా వల్ల కాదు మొర్రో' అని మొత్తుకునే టూత్ పేస్టుని రెండువేల ఒకటో సారి పిండి బ్రష్షు పట్టుకుని బాత్రూంలో దూరడం, గబగబా నాలుగు చెంబులు దిమ్మరించుకుని బయటపడడం, మడత పెట్టని దుప్పటీ, ఆరెయ్యని తువ్వాలు, తెరవబడని ఈనాడు, చిందర వందరగా పడున్న పుస్తకాలు వీడ్కోలు చెబుతుంటే ఇంటికి తాళాలు వేసి, బండి తాళాలు తీసుకుని బయటపడడం, కార్లు, బస్సులు, అసంకల్పిత ప్రతీకార చర్యల ఆటోలు, సర్ప గమనాల తోటి బైకిస్టులు, సిగ్నెళ్ళు, హారన్లు, దుమ్ము, ధూళి, పొగ అన్నిటినీ చీల్చుకుంటూ, తలనొప్పి కడుపులో వికారంతో ట్రాఫిక్ పద్మవ్యూహం నుంచి ఆఫీసు పద్మవ్యూహం చేరడం. "పద్మవ్యూహం నుండి పద్మవ్యూహానికి ."

ఆఫీసులో బండి పార్కు చేసి టైం చూసాడు రవి.. పది తక్కువ పది. పది గంటలకి మీటింగు.

ఇవాళ అతను, గంగారాం కలిసి యు.ఎస్ వెళుతున్నారు ప్రాజెక్ట్ పనిమీద. దాని గురించే ఇప్పుడు మేనేజర్ నీలేష్‌తో మీటింగ్. వేగంగా నడుచుకుంటూ ఆఫీస్‌లోకి ప్రవేశించాడు. లాబీని దాటగానే లిఫ్టు తలుపులు మూసుకుపోతూ కనిపించాయి. గబగబా పరుగెత్తాడు. లిఫ్టులో ఎవరో కొత్త అమ్మాయి. ఇతని గాభరా చూసి లిఫ్టుని ఆపి ఉంచింది. థాంక్స్ చెప్పడం మాట అటుంచి కనీసం మర్యాద పూర్వకంగా నవ్వడానికి పెదాలు విచ్చుకోలేదు. చిరునవ్వుకీ, కన్నీటికీ కూడా దూరమైపోతూ ఏమిటీ జీవితం? తెలియకుండానే ఎంత యాంత్రికత జీవితంలో అనుకున్నాడు! తన ఫ్లోర్ రావడంతో లిఫ్టులోంచి బయటికి నడిచాడు. మెయిల్ రూంని చూడగానే మూడు రోజుల క్రితం అప్లయ్ చేసిన చెక్కు బుక్కు గుర్తొచ్చింది. క్రెడిట్ కార్డు కోసం చెక్ వెయ్యాలి. అందుకని అప్లయ్ చేసాడు. ఇవాళ వెయ్యకపోతే మళ్ళీ వెనక్కి ఎప్పుడొస్తాడో తెలీదు. ఈలోపు వాడు లేట్ పేమెంట్ ఫీజులు, వడ్డీలు అన్నీ వేసి తను ఇండియా

తిరిగొచ్చేసరికి తన ఇల్లు జప్తు చేసెయ్యడానికి రంగం సిద్ధం చేసేస్తాడు. మెయిల్ బాక్స్ తెరిచి చూడగానే బూజు పట్టిన గవర్నమెంటు ఆఫీసులో ఫైల్స్‌లా క్రెడిట్ కార్డు స్టేట్‌మెంట్లు, ఎయిర్ టెల్ బిల్లులు పేరుకుపోయి ఉన్నాయి.

ఎప్పుడైనా ఇటువైపు వస్తే కదా అనుకుంటూ చెక్కు బుక్ కోసం వెతుకుతుంటే అన్ని కవర్ల మధ్యలో ఒక నీలి రంగు ఉత్తరం అతణ్ణి ఆశ్చర్యపరిచింది. ఈ కాలంలో కూడా ఉత్తరాలు రాసేవాళ్ళున్నారా అని తీసి చూసాడు. కవర్ మీద ముత్యాల్లాంటి అక్షరాలు. గబగబా వెనక్కి తిప్పి చూసాడు. 'కావ్య, రాజమండ్రి' అని ఉంది. సందేహం లేదు ఇది ఆమె రాసిందే! "సముద్ర గర్భంలో ఎన్ని అముద్రిత కావ్యాలో!" అన్న  వాక్యాలు మదిలో మెదిలాయి. ఇంతకీ ఇన్నేళ్ళ తర్వాత తన అడ్రసు ఎలా తెలిసింది, ఉత్తరంలో ఏం రాసింది? ఇలా వేల కొద్దీ ప్రశ్నలు అతణ్ణి చుట్టుముట్టాయి. 'ఇలా ప్రశ్నలతో సతమతమవడమెందుకు? చదివితే తెలుస్తుంది కదా! ' అని కవరు చింపుదామనుకుంటుంటే మొబైల్ మ్రోగింది.

"జాయినింగ్ ద మీటింగ్?" నీలేష్ గొంతులో అసహనం.

టైంచూస్తే పది దాటి మూడు నిమిషాలైంది. క్యూబ్‌కి వెళ్ళి ఉత్తరం డెస్క్ మీద పెట్టి, మీటింగ్ రూం వైపు నడిచాడు.

వెళ్ళేటప్పటికి "మీరు యుఎస్ వెళ్ళగానే ఇలా చెయ్యాలి. అలా చెయ్యాలి.. ఆల్బర్టుని ఇంప్రెస్ చెయ్యాలి, జిని  ఇంప్రెస్ చెయ్యాలి, జార్జి బుష్‌ని ఇంప్రెస్ చెయ్యాలి" అని చెప్పుకుంటూ పోతున్నాడు నీలేష్.

గంగారాం మాత్రం సీరియస్‌గా వింటున్నాడు కానీ మొహంలో ఏదో అలసట కనిపిస్తోంది. కాసేపటికి నీలేష్ టాపిక్ మార్చి యు.ఎస్ లో ఏ ఏ ఖర్చులు కంపెనీ భరిస్తుందో ఆ గైడ్ లైన్స్ చెప్పడం మొదలు పెట్టాడు.

అకస్మాత్తుగా గంగారాం భళ్ళున వాంతి చేసుకుని కుర్చీలోంచి కూలబడిపోయాడు. ఒక్క క్షణం ఏం జరిగిందో అర్థం కాలేదు. నీలేష్ కుర్చీలోంచి లేచి గంగారాం వైపు పరిగెత్తుకొచ్చాడు. పిలుస్తుంటే పలకడం లేదు. నీలేష్ వెంటనే ఏక్షన్ లైన్‌కి ఫోన్ చేసి, అర్జంటుగా రూంకి ఇద్దరు అబ్బాయిల్ని పంపించమని, ఈలోపు అంబులెన్స్ నంబర్లకి ఫోన్లు చేసి అంబులెన్స్ రావడానికి టైం పడుతుందని చెప్పడంతో తన కార్లోనే తీసుకువెళదామని నిర్ణయించుకుని సాయం పట్టమన్నాడు.

పదిన్నర అయినా ట్రాఫిక్ తగ్గలేదు. అంత ట్రాఫిక్ లోనూ ఎంతో చాకచక్యంగా డ్రైవ్ చేస్తున్నాడు నీలేష్. మధ్యలో ట్రావెల్ డెస్కుకి ఫోన్ చేసి గంగారాం టికెట్ కేన్సిల్ చెయ్యమని, ఎంప్లాయి సర్వీస్, సీనియర్ మేనేజర్‌కి ఫోన్లు చేసి విషయం చెప్పి, మణిపాల్ హాస్పిటల్‌కి ఫోన్ చేసి బయట స్ట్రెచర్తో సిద్ధంగా ఉండమని చెపుతున్నాడు. యుద్ధరంగంలో సైనికుడి ఏకాగ్రత నీలేష్‌లో చూస్తున్నాడు. ఎంతసేపూ యు.ఎస్ టీం వాళ్ళు ఇలా చెయ్యమన్నారు, అలా చెయ్యమన్నారు అని చెప్పే నీలేషేనా ఇతడు? ఒక మనిషిలో ఎందరు మనుషులో!

మారత హళ్ళి సిగ్నల్ దగ్గర ట్రాఫిక్ జాం అయ్యింది. ఏమీ చెయ్యలేని నిస్సహాయతలో కసిగా స్టీరింగుని కొడుతున్నాడు నీలేష్. మౌనంగా కూర్చుని గంగారాం గురించే ఆలోచిస్తున్నాడు రవి. గంగారాం మత్స్యకారుల కుటుంబంలోంచి వచ్చాడు. "పేదరికమంటే నా కసహ్యం. డబ్బు.. నాకు డబ్బుకావాలి. డబ్బు గురించే నేను పని చేస్తున్నాను" అనేవాడు. ఎలాంటి పని ఇచ్చినా పగలు రాత్రీ కష్టపడి చేస్తాడు. ఐతే సాలరీ హైక్ విషయంలో మాత్రం రాజీ పడడు. అతను నమ్మిందే నిజం. చాలా మొండివాడు. ఒకసారి అంతా కలిసి గోవా వెళదామనుకున్నారు. "నేను రాను" నిక్కచ్చిగా చెప్పాడు. ఏమంటే. "ప్రకృతిలోని దాహం తీర్చలేని తనానికీ, కర్కశత్వానికీ ప్రతీకలా కనిపిస్తుంది సముద్రం. మీరెళ్ళండి" అన్నాడు. తర్వాత తెలిసింది తుఫాను సముద్రం చిన్నప్పుడే వాళ్ళ నాన్నని పొట్టనపెట్టుకుందని. ఎన్ని తుఫానులు అతని మనసులో వెలిసాయో అనుకున్నాడు. ఇప్పుడు స్పృహలేకుండా పడి ఉన్నాడు. జీవితం ఎంత చిత్రమైనది అనుకున్నాడు రవి.

మణిపాల్ హాస్పిటల్ బయట స్ట్రెచర్‌తో రెడీగా ఉన్నారు. కారు ఆపి స్ట్రెచర్ మీదకి ఎక్కించగానే నీలేష్ "నేను కారు పార్కు చేసి వస్తాను. నువ్వెళ్ళి అడ్మిట్ చేస్తూ ఉండు" అన్నాడు. సరే అనిలోపలికి వెళ్ళి, నింపాల్సిన ఫారాలు నింపేసి, కేష్ కౌంటర్లో డబ్బులు కట్టేసి, రూమ్ తీసుకున్నాడు రవి. పదకొండవ అంతస్తులో రూం ఇచ్చారు. రూంలోకి వెళ్ళగానే సెలైన్ బాటిల్స్ ఎక్కించడం మొదలు పెట్టారు. ఇద్దరు డాక్టర్లు వచ్చి 'ఈ టెస్టులు చేయించండి. రిజల్ట్స్ వచ్చాక ట్రీట్మెంట్ మొదలుపెడదాం' అని చెప్పారు. ఈ లోపు నీలేష్ ఆఫీసు అడ్మిన్‌కి ఫోన్ చేసి గంగారాం మచిలీపట్నం ఫోన్ నంబరు అడుగుతున్నాడు. అడ్మిన్ 'చూసి మళ్ళీ ఫోన్ చేస్తా' అని పెట్టేసింది. కాసేపటికి ఫోన్ చేసి గంగారాం వివరాలేవీ సైట్లో అప్లోడ్ చెయ్యలేదు అని చెప్పింది. 'ఛా ఇప్పుడెలా? ' అనుకుంటుంటే నీలేష్ వెళ్ళి గంగారాం జేబులోని మొబైల్ తీసుకొచ్చాడు. తీసి హోం అన్న నంబరుకి డయల్ చేసి, అతనికి తెలుగు రాకపోవడంతో రవిని మాట్లాడమన్నాడు.

'ఏం చెప్పాలి? ' అని అడిగితే 'వివరాలేవీ చెప్పకు, కొంచెం వంట్లో బావులేదు, హాస్పిటల్లో చేర్చాం, వీలుంటే రమ్మను' అన్నాడు. వాళ్ళ చెల్లెలు ఫోన్ ఎత్తింది. పెద్ద కంగారు పడాల్సిందేమీ లేదని చెపుతున్నా, హాస్పిటల్లో చేర్పించాం అనగానే ఏడ్చెయ్యటం మొదలుపెట్టింది. రవికి ఏం చెయ్యాలో తెలీలేదు. ఏవో రెండు ఓదార్పు మాటలు చెప్పి ఫోన్ పెట్టేసాడు. గంగారాం ఇంకా స్పృహలేని స్థితిలోనే ఉన్నాడు. టైం ఒంటిగంట అయ్యింది. పొద్దున బ్రేక్ ఫాస్ట్ కూడా తినలేదేమో కడుపు కాలిపోతోంది. అది గమనించి నీలేష్, నువ్వెళ్ళి భోజనం చేసిరా నేనిక్కడే ఉంటా. 'నువ్వు వచ్చాక నేను వెళతాన'న్నాడు. సరే అని వెళ్ళొచ్చాడు రవి. "టీం ఎవరికీ చెప్పొద్దు. వాళ్ళు వచ్చినా కంగారు పడ్డం తప్పు పెద్దగా చేయగలిగిందేమీ లేదు. మనిద్దరం చాలు. నీకేమైనా పనుందా?" అంటే అమెరికా ప్రయాణం, డెస్కు మీదే వదిలేసిన కావ్య ఉత్తరం ఇవన్నీ మనసులో మెదులుతున్నా, "లేదు" అని మాత్రం చెప్పగలిగాడు రవి. అతణ్ణి ఆ పరిస్థితుల్లో వదిలేసి వెళ్ళడం అన్యాయమనిపించింది రవికి.

భోంచేసి వచ్చి రవి పేపర్ చదువుకుంటున్నాడు. మధ్య మధ్యలో నర్సులు వచ్చి చూసి, రక్తం అవీ తీసుకుని ఏం కావల్సినా ఒక స్విచ్ చూపించి నొక్కమన్నారు. వాళ్ళు వెళ్ళిన కాసేపటికే గంగారాం పక్షవాతం వచ్చిన వాడిలా కాళ్ళు చేతులు కొట్టేసుకుంటున్నాడు. రవికి తారెత్తిపోయింది. స్విచ్ విషయం కూడా మర్చిపోయి బయటకి పరిగెత్తాడు. ఇద్దరు నర్సులు పరిగెత్తు కొచ్చి, కొంత ప్రయత్నించి, వెంటనే డాక్టర్స్‌కి ఫోన్ చేసారు. నలుగురు డాక్టర్లు ఆఘమేఘాల మీద వచ్చి రవిని బయట ఉండమని గంగారాం బెడ్ దగ్గరకి వెళ్ళారు. బయట ఎదుర్చూస్తున్న రవికి టెన్షన్ పెరిగిపోతోంది. వెంటనే నీలేష్‌కి ఫోన్ చేసి విషయం చెప్పేసాడు. 'నేను వెంటనే వస్తున్నాన'న్నాడు నీలేష్. ఇంతలో ఒక డాక్టర్ బయటికొచ్చి 'అతణ్ణి ఐ.సి.యుకి మార్చాలి' అన్నాడు.. రవి సరే అనగానే 'మీరు రెండో ఫ్లోర్లో ఐ.సి.యుకి వచ్చెయ్యండి' అని గంగారాంని స్ట్రెచర్ మీద తీసుకుని వాళ్ళు వెళ్ళిపోయారు.

రవి ఫ్లైట్ ఐదున్నరకి. ముందు ముంబాయ్ వెళ్ళి అక్కడ ఇంకో ఫ్లైట్ మారాలి. అప్పుడు టైం రెండున్నర అయ్యింది. ఒక వైపు ఆ ఉత్తరంలో ఏం రాసుందో అని చూద్దామన్న ఆతృత పెరిగిపోతోంది. కానీ ఆఫీసుకి వెళ్ళొస్తే ఈ ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతే కష్టం. అసలే ఇంకాఏమీ సర్దుకోలేదు సరిగ్గా. ఇలాంటప్పుడే జీవితంలో మరికొంత డిసిప్లిన్ ఉంటే ఎంత బావుణ్ణో అనిపిస్తుంది. నీలేష్ కూడా "ఆఫీస్‌కి వెళ్ళొద్దు. లేట్ అయిపోతుంది. ఇంటికెళ్ళి అక్కడ నుంచి ఎయిర్‌పోర్ట్‌కి వెళ్ళిపో. ఇప్పుడు గంగారాం కూడా రావట్లేదు. నువ్వొక్కడివే ఎలాగైనా నెట్టుకురావాలి" అన్నాడు.

●●●

ఇమ్మిగ్రేషన్ చెక్‌లు అన్నీ ముగించుకుని ఫ్లైట్లో కూచున్నాడు. ఉదయం నుంచీ తిరగడం, టెన్షన్, మరొకవైపు ఉత్తరంలో ఏం రాసుందోనన్న ఆతృత.. తల పేలిపోతోంది. తలమీద చెయ్యిపెట్టుకుని సీటులో వెనక్కి వాలాడు. కాసేపటికి ఫ్లైట్ బయలుదేరింది. ఎయిర్

హోస్టెస్ మూకాభినయం మొదలుపెట్టింది. ఆ మూకాభినయం చూస్తుంటే కావ్య తను మొదటిసారి కలిసిన సంఘటన గుర్తొస్తోంది రవికి.

కావ్య...!! ఇంకా ఈ క్రెడిట్ కార్డులు, బోనసులు, ఇ.ఎం.ఐలు, మొబైలు ఫోనులు, కుళ్ళు, కుతంత్రాలు జీవితంలో ప్రవేశించని రోజుల్లో. ఆ రోజు సాయంత్రం హనుమంతరావు గారింటికి మాథ్స్ ఒలంపియాడ్ పనిమీద వెళ్ళేసరికి ఇంట్లో ఎవరూ లేరు. మేడమీద మాత్రం గోలగా ఉంది. మెట్లెక్కుతుంటే అంతా పండగ వాతావరణం. అంతా డంబ్ షార్డ్స్ ఆడుకుంటున్నారు. 'ఓహో ఈయన ఈ సంవత్సరం కాలేజీ కల్చరల్ క్లబ్ ప్రెసిడెంటొకటి కదూ ' అనుకుంటు ఎక్కుతున్నాడు. ఒక అమ్మాయి చేత్తో చెవి దుద్దుల్ని చూపించి, రెండు చేతుల్నీ పువ్వు ఆకారంలో పెట్టి ఆశగా తన టీం వైపు చూస్తోంది. దుద్దులు, పువ్వులు, ఆకులు అంటున్నారుగానీ చెప్పలేకపోతున్నారు. ఈ లోపు అకస్మాత్తుగా రవికేదో తెలిసిపోతోంది.. తెలిసిపోతోంది.. తెలిసిపోయింది. "స్వర్ణకమలం!" అని అరిచాడు గట్టిగా. అంతా ఒక్కసారి ఇతనివైపు తిరిగారు. ఆ అమ్మాయి కూడా ముంగురులు సవరించుకుంటూ, అభినందన, కోపం, నిస్సహాయత కలగలిపి రవివైపు తిరిగింది. అదే మొదటిసారి తనని చూడ్డం.!!

తర్వాత కొన్ని సార్లు హనుమంతరావుగారి ఇంటికి వెళ్ళినప్పుడు చూసాడు. ఎవరితోనూ ఎక్కువ మాట్లాడేదికాదు. ఎప్పుడూ జీవం తొణికిసలాడే చిరునవ్వు ఆమె పెదాల్ని అంటిపెట్టుకుని ఉండేది. ఎప్పుడైనా కాలేజీ కారిడార్లో కనిపిస్తే కాలేజీ టాపర్ని అన్న ఒక అహంకారంతో ముందు ఆ అమ్మాయే పలకరించాలని అతనికి ఉండేది. ఆ అహంకారమే ఆ అమ్మాయి గురించి ఎవరినైనా అడిగేందుకు కూడా అడ్డొచ్చేది.

"Would you like to have something sir?" ఎయిర్ హోస్టెస్ మృదువైన గొంతు.

"Glass of water..Thanks" అని మంచి నీళ్ళు తాగి కిటికీలోంచి బయటకి చూస్తున్నాడు. గుంపులు గుంపులుగా మబ్బులు. కింద పసిఫిక్ అనంతంగా పరుచుకుని ఉంది. సముద్రాన్ని చూస్తే మళ్ళీ కావ్య గుర్తొచ్చింది.

ఆ రోజు సాయంత్రం హనుమంతరావుగారు సజెస్టు చేసిన మేథమేటిక్స్ పుస్తకాల షాపుల్లో దొరుకుతాయేమో అని జగదాంబా జంక్షన్ దాకా వెళ్ళాడు. అక్కడ తిరిగి తిరిగి ఒక్క పుస్తకం కూడా దొరక్కపోవడంతో విసిగిపోయి కాస్త ప్రశాంతత కోసం బీచ్‌కి వెళ్ళాడు. చిన్న పిల్లల కేరింతలు, ప్రేమ జంటల చిరుతిళ్ళు, రంగుల రాట్నాలు, పిల్లల్ని ఆకర్షించేందుకు గుర్రాలు అన్నిటితో ఆర్.కె బీచ్ చాలా కోలాహలంగా ఉంది. అన్నిటినీ చూస్తూ నడుస్తున్నాడు. వెనక నుంచి "అన్నయ్యా అన్నయ్యా" అని పిలుపు వినబడడంతో ఎవరా అని తిరిగి చూసాడు.

వెనక్కి తిరిగి చూస్తే వనజ.! ఎంత దూరం నుండి పరిగెత్తుకొచ్చిందో రొప్పుతోంది. పిలుస్తుంటే పలక్కుండా వెళ్ళిపోతావేం అంది.

"వినిపించలేదు గానీ.. నువ్వేంటి ఇక్కడ?"

"చెపుతాగానీ రా!" అని లాక్కుపోతోంది. ఎక్కడికి అంటే చెపుతాగా అంటోంది. వనజ, రవి వాళ్ళ క్లాస్మేట్ భాస్కర్ వాళ్ళ చెల్లి. ఎక్కడికో అని ఆలోచిస్తూ ఆమె పక్కన నడుస్తున్నాడు. కొంచెం దూరంలో కావ్య కూచుని సముద్రాన్ని తదేకంగా చూస్తోంది. దగ్గరకి వెళ్ళాక 'కావ్యా.. ' అని పిలిస్తే అప్పుడే లోకంలోకి వచ్చినదానిలా తల తిప్పి వీళ్ళిద్దరి వైపూ చూసింది.

"అన్నయ్యా.. ఈ అమ్మాయి కావ్య. మా ఫ్రెండ్ మీ కాలేజీలోనే బి.ఎస్సీ ఫస్ట్ ఇయర్" అని పరిచయం చేసింది. "కావ్యా ఇతను మా అన్నయ్య వాళ్ళ ఫ్రెండు రవి" అంది.

"తెలుసు మా కాలేజీ టాపర్ కూడా" అంది కావ్య.

రవికి అనవసరంగా అహాన్ని ప్రదర్శిస్తున్నానేమో అన్న ఫీలింగ్ కలిగింది.

ఈ లోపు వనజ "మీరిద్దరూ మాట్లాడుతూ ఉండండి. నేనిప్పుడే వస్తా" అంటూ పరుగెత్తబోయింది.

"మళ్ళీ ఏమైంది?" అంది కావ్య.

"కళ్యాణి వాళ్ళ ఫ్రెండ్ సౌజన్యలా ఉంది. వెళ్ళి పలకరించి వస్తా" అంటోంది.

"ఈ అమ్మాయికి ఊరంతా ఫ్రెండ్సే" అని నవ్వుకున్నాడు రవి.

"ఇంక టైం అయ్యింది. నేను కూడా వెళ్ళాలి" అంది కావ్య.

"ఐతే ఓ పని చెయ్యండి. మీరు నడుస్తూ ఉండండి. నేను వెళ్ళి ఒక్కసారి పలకరించి వచ్చేస్తా" అంది వనజ.

సరే అని ఇద్దరూ లేచి నడుస్తున్నారు. బీచ్‌లో దీపాలు ఒక్కొక్కటి వెలుగుతున్నాయి. చీకటి వెలుగుల మధ్య చిత్రంగా ఉంది సముద్రం. ఇద్దరి మధ్యా మౌనం. ఎందుకో అతనికి రెండు సముద్రాల మధ్య నడుస్తున్న భావన కలిగింది. నున్నటి తడి ఇసుక మీద చిన్నపిల్లలు అక్షరాలు రాస్తున్నారు. అలలొచ్చి చెరిపేస్తున్నాయి. మళ్ళీ రాస్తున్నారు. మళ్ళీ చెరిపేస్తున్నాయి అలలు. ఎవరూ అలసిపోవడంలేదు. ఆమె ఆ దృశ్యాన్ని తదేకంగా చూస్తూ నడుస్తోంది. ఏమైనా మాట్లాడాలంటే గొంతు పెగలడం లేదు. ఏదో సంకోచం. ఎలాగైనా మాట్లాడాలి అనుకుంటూ "ఏంటి అంత తీక్షణంగా చూస్తున్నారు?" అని అడుగుదామని రెండు మూడుసార్లు మనసులో అనుకుని సిద్ధపడుతున్నాడు. ఇంక అడిగేద్దామనుకుంటుండగా "నే వచ్చేసా" అని అరుచుకుంటూ వనజ పరిగెత్తుకొచ్చింది.

ముగ్గురూ నడుస్తున్నారు. ఏవేవో కబుర్లు చెపుతోంది వనజ. రవి 'ఊఁ' కొడుతూ నడుస్తున్నాడు. కావ్య మాత్రం ఇంకా ఆ దృశ్యాన్నే చూస్తోంది.

"ఏంటి అంతలా చూస్తున్నావు? నేను చిన్నప్పుడు బోల్డు సార్లు రాసాను తెలుసా" అంది వనజ. కావ్య చిరునవ్వు నవ్వింది.

"చెప్పు. ఏంటి చూస్తున్నావు" అని చెయ్యి పట్టిలాగుతోంది.

"రేపు చెపుతాలే" అంది కావ్య.

"చెప్పకపోతే చంపేస్తా. అన్నయ్యా నువ్వే సాక్ష్యం" అంది వనజ.

"దేనికి హత్యకా? " అన్నాడు రవి. ముగ్గురూ నవ్వేసారు.

తర్వాత కొన్నాళ్ళకి భాస్కర్ గాడికి జ్వరంగా ఉందని తెలిసి చూడ్డానికి వాళ్ళింటికి వెళ్ళాడు రవి.

"ఏరా ఎలా ఉంది? " అంటే నీరసంగా నవ్వాడు భాస్కర్.

ఈలోపు వనజ లోపలికెళ్ళి ఏదో కవరుతో పరిగెత్తుకొచ్చి "ఇదేమిటో చెప్పుకో చూద్దాం!?" అంటోంది.

"కొంపతీసి నీక్కూడా ఎవరైనా లవ్ లెటర్ రాసేసాడా?" అన్నాడు భాస్కర్‌గాడు నవ్వుతూ.

"తమరు సత్యానికి చేరువగా వచ్చారు. అలా వస్తూ వస్తూ సత్యానికి ముందు ఉన్న పెద్ద ముద్ద పప్పు గిన్నెలో కాలు కూడా వేసారు" అంది వనజ.

"అంతేకదా. పాపం నీకు ఎవడైనా లవ్ లెటర్ రాస్తే వాడు చచ్చాడే" అన్నాడు భాస్కర్.

రవి "తెలీదు నువే చెప్పు" అన్నాడు.

"కవిత అన్నయ్యా.. కవిత!" అంది.

"ఏమిటీ? నువ్వే.. కవిత్వమే..!? అకస్మాత్తుగా వీడికి జ్వరమెందుకొచ్చిందా అనుకున్నా. ఇదన్నమాట అసలు విషయం" అన్నాడు రవి.

"పో అన్నయ్యా. నువ్వు కూడా ఇలా ఐతే మీకు చూపించను" అంటోంది.

"చూపించవా? చూపించు ప్లీజ్.." అన్నా డు రవి.

"ఒరే దీని కవిత కూడా చదవగల నీ ధైర్యానికి జోహార్లు" అంటున్నాడు భాస్కర్.

కవర్లో కాగితం తీసుకుని చదువుతున్నాడు రవి.. ముత్యాల్లాంటి అక్షరాలు.

"ఎందరో ఇసుకలో రాసిన

అందమైన అక్షరాలని

అమాంతం తనలోకి

లాక్కుపోతుంది..!

సముద్ర గర్భంలో ఎన్ని

అముద్రిత కావ్యాలో!"

"ఆ రోజు గుర్తుందా బీచ్‌లో కావ్య, నువ్వు, నేనూ కలిసాం. ఏంటి అలా చూస్తున్నావు - అంటే తర్వాత చెపుతా అంది కదా! తర్వాత ఒక రోజు ఈ కవిత చూపించింది. నేను లాగేసుకున్నా" అంది

అది చదివి ఒక్క క్షణం అలా ఉండిపోయాడు రవి.

భలే రాసిందే అన్నాడు భాస్కర్.

"అవును ఆ అమ్మాయి మీ కాలేజీ యానివర్సరీకి హనుమంతరావు గారితో కలిసి ఏదో మైమ్ రూపొందిస్తోందట" వనజ అంది.

"మా కాలేజీ విషయాలు మాకంటే నీకే ఎక్కువ తెలిసినట్టున్నాయే!?" అన్నాడు భాస్కర్.

"ఓ.. అవునా? ఐతే అందులో నువ్వు ట్రై చెయ్యొచ్చుకదరా బాసీ?" అన్నాడు రవి. భాస్కర్ గాడికి ఏక్టింగ్ పిచ్చి ఉన్నట్టు చాలా కొద్దిమందికే తెలుసు.

"నేనా అసలు వాళ్ళ థీం ఏంటో కూడా తెలుసుకోకుండా ఎలా రా?" అంటున్నాడు భాస్కర్.

"హనుమంతరావుగారితో కావాలంటే నేను మాట్లాడతా. నువ్వు చేస్తే బావుంటుంది" అన్నాడు రవి.

వార్షికోత్సవం దగ్గర పడింది. అనుకున్నట్టుగానే భాస్కర్ అందులో నటించడానికి నిర్ణయించారు. భాస్కర్ పక్కన అనుపమ చేస్తోందిట. థీం ఏంటనేది వాళ్ళ నలుగురికీ తప్ప ఇంకెవరికీ తెలియనివ్వలేదు. వనజ భాస్కర్ గాడిని "చెప్పు చెప్పు" అని వేధించుకు తింటోంది గానీ వాడు చెప్పడంలేదు. "చెప్పేస్తే థ్రిల్ పోతుందే" అంటున్నాడు. "అయినా నీకు చెపితే విశాఖపట్నం సగానికి చెప్పినట్టే" అన్నాడు.

ఆ రోజే వార్షికోత్సవం. ముందు ఎప్పటిలానే కుప్పి గెంతులు, వెకిలి జోకులు అయ్యాక ఇప్పుడు "మౌనరాగం" అని అనౌన్స్ చేసారు. వర్షంలో చిక్కుకున్న ఇద్దరు యువతీ యువకులు అనుకోకుండా ఒకే చూరు కిందకి వస్తారు. ఇద్దరు అపరిచిత వ్యక్తుల మధ్య ఉండే ఇబ్బంది, మౌనం, అయిష్టత, అపనమ్మకం అన్నీ..! ఆ అమ్మాయి, నమ్మకం కుదిరించేలా ప్రవర్తించడం.. ఇవన్నీ భాస్కర్ భలే పలికించాడు. "వీడుట్టి దద్దమ్మగాడనుకున్నానన్నయ్యా. వీడిలో మంచి టాలెంటుందే!?" అంటోంది వనజ పక్కన కూచుని. బ్యాక్ గ్రౌండులో వాన చినుకుల సవ్వడి మంచి ఎఫెక్టునిచ్చింది. తర్వాత ఈ మైమ్ రూపకర్తలైన కావ్య, హనుమంతరావుగారిని వేదిక మీదకి పిలిచారు. వారిద్దరి సృజనాత్మకతను ప్రిన్సిపాల్‌గారు తెగ మెచ్చుకున్నారు.

మరుసటి రోజు కాలేజీకి వెళితే పెద్ద గుంపుగా అంతా మూగివున్నారు. మళ్ళీ AVBP వాళ్ళు బందులాంటిదేమైనా పెడుతున్నారా అని వెళ్ళి చూసాడు రవి. చూస్తే మధ్యలో కావ్య ఉంది. చుట్టూ ఉన్న కాలేజీ స్టూడెంట్స్ అభినందనల వర్షం కురిపిస్తున్నారు. భలే అనిపించింది ఆ దృశ్యం. కంగ్రాట్స్ చెపుదామనుకుంటే వినిపించదని, దూరం నుంచే చెయ్యి ఊపి చిరునవ్వుతో అభినందించాడు.

ఆమె కూడా చెయ్యి ఊపి, చిరునవ్వు నవ్వింది. అంతమందిలో ప్రత్యేకంగా తనని గుర్తించడం కాస్త గర్వంగా ఫీలయ్యాడు రవి. ఇకా చాలా కొన్ని జ్ఞాపకాలు ఆమెతో!

తర్వాత MCACETకి చదువుకోవడంలో బిజీ ఐపోయాడు రవి. హనుమంత రావుగారింటికి వెళ్ళడం కూడా తగ్గిపోయింది. తర్వాత ప్రిపరేషన్ హాలిడేస్ ఇచ్చేసారు. ఇవన్నీ అయ్యేసరికి రెండు నెలలు పట్టింది. MCACET ఐపోయాక, హనుమంతరావుగారింటికి వెళ్ళారు భాస్కర్, రవి కలిసి. మాటల మధ్యలో కావ్య వాళ్ళ నాన్నగారికి హైదరాబాద్ ట్రాన్స్‌ఫర్ ఐపోయినట్టూ, వాళ్ళంతా హడావిడిగా షిఫ్టు అయిపోయినట్టూ తెలిసింది. తిరిగొస్తున్న రవి, భాస్కర్‌ల మధ్య నిశ్శబ్దం. ఇంటికి వెళ్ళి వనజకి ఈ విషయం చెపితే "నాతో కూడా చెప్పకుండా వెళ్ళిపోతుందా?! ఈసారి కనబడనీ చంపేస్తా" అంది.

కాలం చిత్రమైంది. ఎంత గాఢమైన పరిచయాలనైనా మరుగు పడేలా చెయ్యగలదు. MCAలో సీటు రావటం, తర్వాత ఉద్యోగాల వేట, ఉద్యోగం, ఉరుకులు పరుగులు ఇలా ఆమె పూర్తిగా అతని స్మృతి పథంలోంచి చెరిగిపోయింది. మళ్ళీ ఇదిగో ఇప్పుడు ఈ ఉత్తరం.!

ఇంతకీ ఆ ఉత్తరంలో ఏం రాసిందో..!? కళ్ళు మూసుకుని తల వెనక్కి వాల్చి ఆలోచిస్తున్నాడు. ఎడతెగని ఆలోచనలా ఫ్లైట్ సాగిపోతూనే ఉంది. కాసేపు ఏవైనా సినిమాలు చూద్దామని టీవి ఆన్ చేసాడు. అన్ని ఛానల్స్ మారుస్తూ ఉంటే, కింద సబ్ టైటిల్స్‌తో ఏదో చైనీస్ మూవీ వస్తోంది. కమ్యూనిస్టుల పాలనలోని చైనాలోని ఒక మారుమూల పట్టణంలో జరిగిన ప్రేమ కథ. అది చూస్తూ చూస్తూ ఎప్పుడు నిద్రపోయాడో తెలీదు. మధ్యలో టోక్యోలో ఫ్యూయల్ ఫిల్లింగ్‌కి ఆపేదాకా తెలివి రాలేదు. మధ్య మధ్యలో పాటలు వింటూ, ఏదో పుస్తకం చదువుతున్నాడు గానీ గంగారాం ఎలా ఉన్నాడో, ఆ ఉత్తరంలో ఏం రాసుందో అన్న టెన్షనే ఎక్కువగా ఉంది అతనికి.

మొత్తానికి ఎలాగైతేనేం శాన్‌ఫ్రాన్సిస్కో ఎయిర్ పోర్ట్‌లో దిగాడు. టాక్సీ తీసుకుని హోటల్‌కి వెళ్ళి, గోరు వెచ్చని నీళ్ళతో స్నానం చేసి సాండ్‌విచ్ తిని పడుకున్నాడు. కాలింగ్ కార్డ్ తీసుకుని ఇంటికంటే ముందు నీలేష్‌కి ఫోన్ చేసాడు. ' నిన్న సాయంత్రం వెళ్ళి చూసొచ్చా. అప్పటికి మెల్లగా స్పృహ వచ్చింది అయినా ఇంకా ఐ.సి.యు లోనే ఉన్నాడు ' అని చెప్పాడు.

డాక్టర్లు మెదడులో ఏదో సిస్టులా ఫాం అయ్యిందని చెప్పారట. ' గంగారాంకి ఏం కాకూడదు.. ' అని మనసులో అనుకున్నాడు.

మర్నాడు ఆఫీసుకి వెళ్ళేసరికి వేలకొద్దీ బగ్లు, ఇష్యూలు ఆహ్వానించాయి. గత రెండు రోజుల సంఘటనల తర్వాత పనిమీద ఏకాగ్రత నిలపడం కష్టంగానే ఉంది. మధ్యాహ్నం క్యూబ్‌కి మేనేజర్ రాబర్ట్ వచ్చి పలకరించాడు. ఇద్దరూ కలిసి కాఫీ తాగడానికి వెళ్ళారు. కంపెనీ సక్సెస్‌కి ఇప్పుడు చేస్తున్న ప్రోడక్ట్ ఎంత ముఖ్యమో చెప్పాడు. నువ్వు బాగా పనిచెయ్యాలన్న విషయం అంతర్లీనంగా అందులో ఉంది. ఇతను సామాన్యుడు కాదు అనుకున్నాడు మనసులో.

మొదటి మూడురోజులు అక్కడ వాతావరణానికి అలవాటు పడడం, అక్కడి ఇష్యూస్‌ని అర్థం చేసుకోవడంతోనే సరిపోయింది. ఎప్పటికప్పుడు నీలేష్‌కి ఫోన్ చేసి గంగారాం ఆరోగ్యం సంగతి తెలుసుకుంటున్నాడు. మెల్ల మెల్లగా కోలుకుంటున్నాడని తెలిసి ఆనందపడ్డాడు. ఒకరోజు ఆఫీసు ఐపోయాక కేబ్‌లో ఇంటికొస్తుంటే మొబైల్ మ్రోగింది. చూస్తే ఏదో ఇండియా నంబరు.

ఎవరా అని లిఫ్ట్ చేస్తే "హలో రవీ నేను గంగారాంని" అని వినిపించింది.

"గంగారాం..!!" అని సంతోషంతో అరిచాడు రవి.

కేబ్ డ్రైవర్ కంగారుగా వెనక్కి తిరిగి చూసాడు.

"కంగారుపడాల్సిందేమీ లేద"ని చేత్తో అతనికి సైగ చేసి, "ఏంటి ఎలా ఉన్నావ్? డిస్చార్జ్ చేసేసారా?" అంటే

"లేదు ఐ.సి.యు నుంచి మామూలు వార్డుకి షిఫ్ట్ చేసారు. ఇంకో మూడు నాలుగురోజుల్లో డిస్చార్జ్ చేస్తారుట" అని చెప్పాడు. ఆ సంతోషంలో తర్వాతి రోజునుంచీ ఉత్సాహంగా పని చెయ్యడం మొదలుపెట్టాడు. రెండో వారం రవి performance చూసి రాబర్ట్ కూడా పొంగిపోయాడు. రవి క్యూబ్ కి వచ్చి You are doing excellent work అని చెపుతున్నాడు.

కొన్నాళ్ళకి నీలేష్ ఫోన్ చేసి "గంగారాం డిస్చార్జ్ అయ్యాడు. ఇంట్లో రెస్ట్ తీసుకుంటున్నాడు. యు.ఎస్ వెళ్ళిపోతానంటున్నాడు" అని చెప్పాడు.

"పూర్తిగా తగ్గేదాకా పంపించకండి. ఇక్కడ నేను చూసుకుంటా" అన్నాడు రవి.

అప్పటికి సరే అన్నాడు గానీ గంగారాం బలవంత పెట్టడంతో ఆ శుక్రవారం గంగారాంకి టికెట్స్ బుక్ చేసేసారట. ఎయిర్ పోర్టుకి వెళ్ళి గంగారాంని రిసీవ్ చేసుకుని హోటల్‌కి వెళ్ళిపోయారిద్దరూ.

ఇక తర్వాత రెండువారాలు, ఇద్దరూ కలిసి అన్ని ఇష్యూలు సాల్వ్ చేసేసారు. రాబర్ట్ వచ్చి "ఇంకో రెండువారాలు ఎక్స్టెండ్ చేసేదా మీ ట్రిప్?" అన్నాడు. గంగారాం ఓకే అంటున్నాడు. రవి మాత్రం లేదు నేను వెళ్ళాలి అన్నాడు.

నీలేష్ ఫోన్ చేసి "రవీ.. ఈ పదిహేను రోజులు క్రూషియల్" అంటున్నాడు.

"లేదు.. అక్కడికొచ్చి వర్క్ చేస్తా" అన్నాడు.

"సరే నీ ఇష్టం.." అని గంగారాం అక్కడ ఉండేందుకు, రవి ఇండియా నుంచి వర్క్ చేసేందుకు ఒప్పించాడు. రాబర్ట్ కూడా సరే అన్నాడు. గంగారాంకి వీడ్కోలు చెప్పి, జాగ్రత్తలు చెప్పి ఫ్లైట్ ఎక్కాడు.

●●●

విమానం బెంగుళూరు ఎయిర్ పోర్ట్ ఆగింది. కస్టమ్స్ చెక్ అన్నీ ముగించుకుని బయటపడ్డాడు రవి. రిసీవ్ చేసుకోడానికి రూమ్మేట్ సుమంత్ గాడొచ్చాడు. జెట్ లాగ్, తలనొప్పి అన్నిటినీ ఉత్తరం చదవబోతున్నానన్న ఆనందం వెనక్కి నెట్టింది. లగేజ్ ఇంట్లో పడేసి,

"ఒరే ఒక్కసారి మా ఆఫీసుకి వెళ్ళొద్దాం రా.." అన్నాడు రవి

"ఏరా యు.ఎస్‌లో కొట్టింది ఇంకా దిగలేదా? ఇప్పుడు ఆఫీసుకేంట్రా?"

"లేదు రా.. ఒక్కసారి వెళ్ళొద్దాం"

"రేపు ఉదయం ఎలాగూ వెళతావు కదరా.."

"కాదు రా. ఇప్పుడే వెళ్ళాలి. రేపు ఉదయం దాకా ఆగలేను. ప్లీజ్‌రా.."

సుమంత్‌కి ఆశ్చర్యం వేసింది. ఎందుకింత ప్రాధేయపడుతున్నాడు వీడు?

"ఈ ఒక్క హెల్ప్ చెయ్యరా. చాలా అలిసిపోయాను. ఈ స్థితిలో నేను డ్రైవ్ చెయ్యలేను. అందుకే నిన్ను అడుగుతున్నా."

"సరే పద" అన్నాడు సుమంత్.

ఇద్దరూ వెళ్ళారు. డెస్క్ దగ్గరపడుతున్న కొద్దీ రవిలో ఉద్వేగం. డెస్క్ రాగానే పరుగెత్తాడు. వెళ్ళి చూసేసరికి డెస్క్ మీద కవర్ లేదు.!!! పిచ్చివాడిలా సొరుగులన్నీ తీసి చూశాడు. కసిగా అన్ని కాగితాలనీ చెల్లా చెదురు చేసేస్తున్నాడు.

"యు.ఎస్ వెళ్ళక ముందొచ్చింది. ఇప్పటి దాకా ఉంటుందా?" విషయం తెలుసుకుని సుమంత్ అడిగాడు.

"లేదురా. జనరల్‌గా ఎవరూ తియ్యరు. తుడిచేవాళ్ళు అంతా తుడిచేసి వెళ్ళిపోతారు గానీ కాగితాలు, కవర్లు ముట్టుకోరు" రవికి ఏడుపొక్కటే తరువాయి. పక్క క్యూబికల్స్, డస్ట్‌బిన్స్ పిచ్చివాడిలా వెతుకుతున్నాడు. వెతికి వెతికి వెనక్కొచ్చి భరించలేని నిస్సహాయతతో కుర్చీలో కూలబడ్డాడు. చేతులు రెండూ జుత్తులోనికి పోనిచ్చి తలదించుకుని కూచున్నాడు.

కాసేపు అతన్ని మౌనంగా ఉండనిచ్చి సుమంత్ అడిగాడు.

"మాకు ఎవ్వరికైనా చెప్పాల్సింది కదా! ఇప్పుడేం చేద్దామనుకుంటున్నావ్?"

"వెతకాలి.. కలుసుకోవాలి"

"ఏం తెలీకుండా ఎలా వెతుకుతావురా?"

"ఉత్తరం వెనక రాజమండ్రి అని ఉంది"

"రాజమండ్రి ఏమైనా చిన్న ఊరు అనుకుంటున్నావా?"

"ప్రయత్నిస్తాను. కాలేజీలో ఆ అమ్మాయి కవితలు రాసేది. ఆ దిశగా ప్రయత్నిస్తాను. రేపే రాజమండ్రి బయలుదేరుతున్నా"

"ఒరే నీకు మతిగానీ పోయిందా? ఇంక ఇవాళే అంత ప్రయాణం చేసి వచ్చావ్.. జెట్‌లాగ్ నుండి తేరుకోడానికే వారం పడుతుంది. అదీకాక యు.ఎస్ మేనేజర్‌నీ వర్కుని మెచ్చుకున్నాడనీ, వచ్చే ఏడాది ప్రమోషన్ కూడా ఇచ్చే అవకాశాలున్నాయనీ, ఈ పదిహేను రోజులు క్రూషియల్ అనీ చెప్పావ్. అదంతా వదిలేసి ఇప్పుడిలా అర్థాంతరంగా వెళ్ళిపోతే?"

అతను ఏమీ వినిపించుకునే స్థితిలో లేడు తర్వాతి రోజు నీలేష్‌కి చెప్పేసాడు. "అర్జంటు పనిమీద రాజమండ్రి వెళుతున్నా! రావడానికి ఒక వారం రోజులు పట్టొచ్చు" అని.

రాజమండ్రిలో లైబ్రెరీలన్నీ నెట్‌లో వెతికి వాటి అడ్రస్సులు, ఫోన్ నంబర్స్ రాసుకున్నాడు. అలాగే రాజమండ్రిలో ప్రస్తుతం ఉన్న రచయితలు, కవుల అడ్రసులు కూడా కొంతవరకు సంపాదించాడు. మూడు రోజులపాటు రాజమండ్రిలోని గ్రంథాలయాలన్నీ తిరిగాడు. కొందరు లైబ్రేరియన్లు అలాంటి సమాచారం మేం చెప్పం అంటున్నారు. కొందరు కసురుకుంటున్నారు. కొందరు పైపైన వెతికి అలాంటి పేరుగల మెంబర్స్ ఎవరూ లేరంటున్నారు. ఇక లాభం లేదని అక్కడ లైబ్రెరీకి రెగ్యులర్‌గా వచ్చే మెంబర్స్‌ని కలిసి అడగడం మొదలు పెట్టాడు. ఎక్కడా ఎలాంటి క్లూ దొరకడం లేదు. ఈలోపు నీలేష్, కొలీగ్స్ ఫోన్లు - ఎప్పుడొస్తున్నావని ఒకరు, ఈ ప్రోబ్లం ఎలా సాల్వ్ చెయ్యాలి, ఆ ఫైల్ ఎక్కడుంది అని ఒకరు.

అప్పుడప్పుడు వెళ్ళి ప్రశాంతత కోసం గోదావరి ఒడ్డున కూచుంటున్నాడు. చిన్నప్పటినుంచీ ఊరించే ఏ ప్రాబ్లంనైనా సాధించేవరకూ అతనికి నిద్రపట్టేది కాదు. లెక్కంతా చేసేసి, వెనక పేజీలో ఆన్సర్ చూసి అప్పుడు హాయిగా నిద్రపోయేవాడు. ఇప్పుడు ఒక్కో చోటా విఫలమయ్యేకొద్దీ అతను పట్టుదల ఇంకా పెరిగిపోతోంది. కావ్యని ఎలాగైనా కలిసి, ఆ ఉత్తరంలో ఏం రాసుందో తెలుసుకోవాలని. ఆ రోజు రాత్రి పడుకోబోయే ముందు అనుకున్నాడు.

మర్నాడు ఎలాగైనా కొంత ప్రోగ్రెస్ సాధించాలని. ఉదయాన్నే లేచి ఒక్కో రచయిత ఇంటికీ తిరగడం మొదలు పెట్టాడు. చాలామంది మాకు తెలీదన్నారు. కొందరు పొగరుగా 'ఎంతో మంది వస్తూ ఉంటారు. ఎంతమందినని గుర్తుపెట్టుకోగలం?' అన్నారు. ఒకాయన మాత్రం 'ఇక్కడే పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉంది. అక్కడకి వెళ్ళి చూడండి. మీకేమైనా వివరాలు దొరకొచ్చు' అన్నారు. నదిలో కొట్టుకుపోతున్న వాడికి ఏదో చిన్న ఊత దొరికినట్టయ్యింది. మర్నాడే వెళ్ళాడు. అందరినీ అడగ్గా అడగ్గా ఒక అమ్మాయి చెప్పింది.

"నారాయణరావుగారి దగ్గరకి ఒకటి రెండు సార్లు వెళ్ళినప్పుడు, అక్కడ ఒక అమ్మాయి కనిపించింది. ఆ అమ్మాయి పేరు కావ్య అని చెప్పినట్టు గుర్తు. "

"ఆ అమ్మాయి ఇప్పుడెక్కడ ఉంటోంది? ఏం చేస్తోంది?"

కంగారు ఆతృత చూసి ఆ అమ్మాయి కొంచెం భయపడింది.

"నాకు వివరాలు తెలీవండీ. నారాయణరావుగారి ఇంటికి వెళితే మీకు వివరాలు దొరకవచ్చు" అంది.

"సీతంపేట వెళ్ళి నారాయణ రావుగారి ఇల్లంటే ఎవరైనా చెపుతారు" కొంచెం క్లూ ఇచ్చింది..

ఆమెకి మరీ మరీ థ్యాంక్స్ చెప్పి వెంటనే వెళ్ళాడు. సీతం పేట మూడో వీధిలో రెండస్థుల డాబా ఇల్లు ఆయనది.

"నారాయణ రావుగారున్నారా?" అంటే

ఒక పదిహేనేళ్ళ అమ్మాయి లోపలి నుండి పరిగెత్తు కొచ్చి "రండి" అంటూ తీసుకెళ్ళింది.

రెండు గదుల దాటుకుని మెట్లెక్కితే ఆయన గది వచ్చింది.

"తాతయ్యా మీ గురించి ఎవరో వచ్చారు" అని చెప్పి ఆ పిల్ల వెళ్ళిపోయింది.

పాత కాలం నాటి గది. నల్లని నగిషీల షెల్ఫ్‌ల్లో బైండ్ చేసిన వేలకొద్దీ పుస్తకాలు. గోడకి జిడ్డు కృష్ణమూర్తి ఫోటో. గదికి ఒక మూల ముక్కాలి పీట మీద భగవద్గీత. ఆయన ఈజీ చైర్లో కూచుని ఏదో పుస్తకం చదువుకుంటున్నాడు. డెబ్బై ఏళ్ళుంటాయేమో. మంచి స్ఫురద్రూపి. కిటికీలోంచి మధ్యాహ్నపు ఏటవాలు ఎండ పడి అతని తెల్లగెడ్డం మెరుస్తోంది.

"నమస్కారమండీ" అన్నాడు రవి.

చదువుతున్న పుస్తకం పెట్టి, కళ్ళద్దాలు సవరించుకుని ఇతని వైపు చూసారు. కూచోమన్నట్టు సైగ చేసారు. కుర్చీ ఆయనకి దగ్గరగా జరుపుకుని కూచుని పరిచయం చేసుకున్నాడు.

ఆయన "వాణీ!" అంటూ కేకేసారు.

గొంతులో సన్నని వణుకు.

ఆ పిల్ల పరుగెత్తుకు వచ్చి "ఏం కావాలి తాతయ్యా?" అంది.

"కొంచెం మంచి నీళ్ళు తీసుకురా తల్లీ" అన్నారు.

"మీ దగ్గర చాలా పుస్తకాలున్నాయండీ" అన్నాడు రవి.

ఆయన నవ్వి "ఒకప్పుడు మనసులో అగ్ని జ్వాలలు రగిలించి ఇప్పుడు షెల్ఫుల్లో మత్తుగా నిద్రపోతున్న పుస్తకాలు" అని, "ఏం పని మీదొచ్చారు?" అన్నారు.

"మీతో ఓ ముఖ్యమైన పనుండి వచ్చానండీ" అని వచ్చిన పని చెప్పాడు.

ఈలోపు వాణి మంచి నీళ్ళు తీసుకొచ్చింది. ఆయన తాగి చెప్పడం మొదలుపెట్టారు.

"కావ్యా!? చాలా మంచి పిల్ల. వ్యక్తిగత విషయాలు ఎవరికీ చెప్పేది కాదు. తెలుగు భాష , చరిత్ర, నుడికారం వీటి మీద పరిశోధన జరిపేది"

"ఇక్కడ ఏదైనా యూనివర్సిటీలో చదువుతోందా?"

"డిగ్రీల కోసం పరిశోధన కాదు ఆమెకది. ఆత్మ సంతృప్తికోసం. నిజమైన పరిశోధన ఏదీ ఆశించని ఇలాంటి వాళ్ళ వల్లే జరుగుతుంది"

"మీ దగ్గరకి తరుచు వస్తుందా?"

"నుడికారాన్ని పట్టుకోవాలని ఎక్కువగా చుట్టు పక్కల గ్రామాల్లో తిరిగేది. అప్పుడప్పుడు ఏవో పురాతన గ్రంధాలు నా దగ్గర ఉంటే వాటి గురించి వచ్చేది. తీసుకున్న పుస్తకం తిరిగిచ్చే అలవాటున్న అతి కొద్దిమంది తెలుగువాళ్ళల్లో ఈ అమ్మాయి ఒకరు. ఆఖరి పుస్తకం తిరిగి ఇస్తున్నప్పుడు అందులో ఏదో కాగితం ఉండిపోయింది. అప్పటిదాకా ఆమె కవిత్వం రాస్తుందని నాకు తెలీదు" అన్నారు.

రవికి ఆతృత, ఒక పక్క ఆ అమ్మాయిని కలవబోతున్నానన్న సంతోషం.. ఇంక ఆలస్యం చెయ్యకుండా అడిగాడు.

"ఆ అమ్మాయిని నేను కలవాలి సార్!! ఆ అమ్మాయిని నేను కలవాలి.."

ఇతని ఆతృత చూసి అయిన మౌనంగా లేచి, షెల్ఫులో పాత పుస్తకం, 'ఈనాడు' జిల్లా ఎడిషన్ తీసుకొచ్చారు. పుస్తకంలోంచి చిన్న కాగితం తీసి ఇచ్చారు. అందులో చిన్న కవిత అవే అక్షరాలు.

"ఒక్క కన్నీటి చుక్క.

కొలను మీద వృత్తాలు

అనంతంలోకి..

అదృశ్యమౌతూ."

ఎంత బాధలో ఇది రాసిందో అనుకుంటూ 'ఈనాడు' పేపర్ చూసాడు. లోపల పేజీలో విద్యార్థిని ఆత్మహత్య అన్న వార్త.

"కొంచెం ఆలస్యం చేసావు బాబూ" అంటున్నారాయన.

రవికి ఏమీ వినిపించడంలేదు.

పిచ్చివాడిలా గోదావరి ఒడ్డుకి పరుగెత్తిపోయాడు. చీకట్లు చిక్కబడుతుంటే గోదావరి ఒడ్డున కూచున్నాడు. ఆకాశంలో దట్టంగా మబ్బులు కమ్ముకున్నాయి. అవతలి ఒడ్డున దీపాలు ఒక్కొక్కటీ వెలుగుతున్నాయి. మౌనంగా గంభీరంగా ప్రవహిస్తోంది గోదావరి.

ఆ రోజు ఒక్క ఐదు నిమిషాల ముందు ఆఫీసుకి వెళ్ళుంటే అమెరికా ప్రయాణానికి లగేజ్ కాస్త ముందే సర్దుకునుంటే, మెయిల్ రూం ఒక్క రోజు ముందు చూసుకునుంటే, ఉరుకుల పరుగుల జీవితంలో కాస్త లయని కాపాడుకునుంటే.!?

పడమటి ఆకాశాన్ని వీడలేని సూర్యుని అవశేషాలు గోదావరి తరంగాల్లో ప్రతిబింబిస్తున్నాయి. అకస్మాత్తుగా వర్షం మొదలయ్యింది. అతనికి అక్కడ నుండి కదలాలనిపించలేదు. నిలువునా తడుస్తూ అక్కడే కూచున్నాడు. మసక వెలుగులో గుచ్చి గుచ్చి ప్రశ్నించే చినుకులకి అల్లకల్లోలమౌతోంది గోదావరి.

ఏం రాసుంటుంది? జీవన్మరణ సరిహద్దుల్లో అటా ఇటా అని సంశయంలో తన సహాయం ఏమైనా కోరి రాసిందా? ఒక కవి, సున్నిత మనస్కురాలు.. ప్రపంచంతో విసిగిపోయి మృత్యు సమక్షాన తన అనుభవ సారాన్నంతా రంగరించిందా? నక్షత్రానికీ నక్షత్రానికీ మధ్య ఉన్న చీకటి అగాధల్లోకి పయినమౌతూ ప్రపంచానికి తను మిగల్చదల్చిన అడుగుజాడల్ని ఆ లేఖలో భద్రపరిచిందా?

దేన్ని తెలుసుకోగలడు? ఏది అర్థమౌతుంది? గుచ్చి గుచ్చి ప్రశ్నించే వాన చినుకులకి గోదావరి ఎప్పటికైనా సమాధానం చెప్పగలదా? భరించలేని నిస్సహాయత అతణ్ణి ఆవరించింది. దూరంగా బ్రిడ్జి మీద ఏదో రైలు వర్తమానాన్ని గతాన్ని చేస్తూ భవిష్యత్తులోకి దూసుకుపోతోంది. కురుస్తున్న కోటానుకోట్ల వాన చినుకుల్లో అతని కన్నీటి బొట్టొకటి కలిసిపోయింది.

Click here to share your comments on this story